క్లుప్తంగా

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిక్షణ



విద్యార్థులతో ఎన్‌సీసీ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్ కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ గురువారంతో ముగిసింది. తిరుపతి 5వ ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ సుబేదార్ సింగార్ సింగ్, హవాల్దార్ ప్రీణిరామ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాబోయే బి, సి సర్టిఫికెట్ పరీక్షలకు సంబంధించి థీయరీ, డ్రిల్ ప్రాక్టీస్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, సీటీఓ స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు పర్యటన

కడప రూరల్ : ప్రభుత్వ మైనార్టీ సలహాదారు ఎంఏ.షరీఫ్ గురువారం కడప నగరంలో పర్యటించారు. రామాంజనేయపురంలోని ఏపీ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్ విద్యార్థులతో ఆయన మాట్లాడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ దావూద్ మౌలానా, మైనార్టీస్ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ ఇమ్రాన్, గౌస్‌బాషా పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాషా తెలిపారు. ఈ నెల 25వ తేదీన పొద్దుటూరు లేపాక్షి డిగ్రీ కళాశాలలో కోడ్ వర్క్స్ ఎడ్యుకేషన్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆఫ్ క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆరుగురు బీఎస్సీ(బిఎంసి), ఇద్దరు బీకాం విద్యార్థులు ప్రతిభ చాటి బెంగళూరుకు చెందిన స్కిల్ ఇంటర్న్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఎంపికైనట్లు తెలిపారు. వారికి ఏడాదికి రూ.5.2లక్షల వేతనం ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, జేకేసీ కో ఆర్డినేటర్ సుజాత, ఎఫ్‌టీఎం వరప్రసాద్‌లతోపాటు డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జులు అభినందించారు.

దోమలతో జరభద్రం

కడప రూరల్: దోమలు కొట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ అన్నారు. స్థానిక మోచంపేటలో ఉష్ణ మండల వ్యాధుల గురించి స్థానికులకు గురువారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూలెక్స్ దోమలతో బోదకాల వ్యాధులు వస్తాయన్నారు. దోమ కుట్టిన ఏడాది తర్వాత వ్యాధి లక్షణాలు బయటపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి, శంకర్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు సర్కిల్ కార్యాలయ జనరల్ మేనేజర్ పాండురంగ మితంతయ్య తెలిపారు. కడప నగరంలోని మయూరా గార్డెనియాలో రీజినల్ హెడ్ మురళీమోహన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కెనరా బ్యాంకులోని కెనరా ట్రెస్ట్ ప్రొడెక్ట్‌లోని ఫ్యూచర్లు, ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా కెనరా ట్రెస్ట్ కస్టమర్లు 105 మందిని సత్కరించారు. రీజినల్ హెడ్ మురళీమోహన్ మాట్లాడుతూ ట్రెస్ట్, కెనరా ఏంజెల్, అస్పైర్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు, బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, డివిజనల్ మేనేజర్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని అవ్వారు హాస్పిటల్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అవ్వారు అర్జున్‌కుమార్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డయాబెటిక్ న్యూరోపతి టెస్టు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ద్వారా పాదాలు మెరుగ్గా పనిచేస్తున్నాయా? లేదా? అని తెలుసుకోవచ్చన్నారు. పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పేరు నమోదు చేసుకోవాలన్నారు.

'స్టాప్, వాష్ అండ్ గో



ముఖం కడుక్కుంటున్న డ్రైవర్లు

కడప అర్బన్ : జిల్లాలో రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 29వ తేదీ రాత్రి నుంచి 30వ తేదీన తెల్లవారుజాము వరకు 'స్టాప్, వాష్ అండ్ గో' కార్యక్రమాన్ని జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించారు. తెల్లవారుజామున నిద్రమత్తు లేకుండా వాహన డ్రైవర్లకు నీరందించి ముఖం కడుక్కుని వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ చర్యలతో పోలీసులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

మహాత్మా గాంధీ సేవలు మరువలేనివి



మహాత్ముని విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశం కోసం తన జీవితాన్ని ధారపోసిన జాతిపిత మహాత్మాగాంధీ త్యాగం మరువలేమని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్ అన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ చూపిన శాంతి, అహింస, సమానత్వం అనుసరణీయమార్గాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడప కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధులు కమల్‌బాషా, జహోర్, హమీద్, ఖాదర్ ఖాన్, ఆబీద్, రహమతుల్లాఖాన్, బాబ్జి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడప కల్చరల్: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఏవీఎస్ వీకేఎస్పీ కడప క్లబ్ ఆధ్వర్యంలో బాపూజీకి ఆర్య వైశ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య మహా సభ పొలిటికల్ వైస్ చైర్మన్ పడుచూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు.అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో 200 మందికి అల్పాహారం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడే గుడుగుంట్ల లక్ష్మయ్య, దరిశా శ్రీనివాసులు, కోశాధికారి, మాడిశెట్టి నారాయణ, లేపురి మహేష్, నారాయణ సురేష్, పలకల సుబ్బారావు, డాక్టర్ వెంకట్‌రామ్, ముచ్చర్ల వెంకటసుబ్బయ్య, డాక్టర్ రామ్మూర్తి పాల్గొన్నారు.

అల్‌షిఫాలో:

స్థానిక అల్‌షిఫా మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో గాంధీ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని షహీద్ దివస్‌గా నిర్వహించుకోవడం పరిపాటి అని, ఆయుధం లేకుండా ఆంగ్లేయులను గెలిచిన గాంధీజీకి లోకంలో ఎవరూ సాటిరారని సంస్థ నిర్వాహకులు మహమ్మద్ రఫీ కొనియాడారు. గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తేజస్విని, శిరీష కార్యక్రమంలో పాల్గొన్నారు.

నూతన విధానంతో పేదలకు విద్య దూరం



మాట్లాడుతున్న రవికుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానంతో పేద విద్యార్థులకు విద్య దూరమవుతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవికుమార్ అన్నారు. గురువారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ 28వ జిల్లా మహాసభల సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో విద్య మొత్తం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేతిలోకి వెళ్లిపోయిందన్నారు. యూనివర్సిటీలు వ్యాపార కేంద్రంగా మారిపోయాయన్నారు. పేద విద్యార్థులు బడి బయట ఉండాలనే కుట్ర చేస్తున్నారని తెలిపారు. దేశంలో డబ్బు ఉన్న వాడికి ఒక విద్య లేని వాడికి మరో విద్య అన్నట్లు పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుంటేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, విద్యార్థి సంఘం మాజీ నాయకుడు కుమారస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, వంశీ, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

తరగతుల తరలింపు తగదు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం 117 జీఓ పునర్ వ్యవస్థీకరణ మెమో ద్వారా విస్తృతంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల తరలింపు సరైన చర్య కాదని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన 117 జీఓ వల్ల ప్రాథమిక పాఠశాల వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. అందుకే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు 117 జీఓ రద్దు కోరుకున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 117 జీఓను రద్దు చేసి పాఠశాలల పునర్ నిర్మాణ ప్రక్రియ చేపడతామని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ అధికారులు తీసుకుంటున్న అసంబద్ధమైన నిర్ణయాలతో విద్యా రంగానికి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు.

ఏకపక్ష వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్నమగ్బూల్ బాషా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏకపక్ష వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా కోరారు. గురువారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో వక్ఫ్ చట్ట సవరణ జాయింట్ పార్లమెంటరీ కమిటీని నియమించిన ప్రభుత్వం సవరణలపై వచ్చిన అభ్యంతరాలు, అభిప్రాయాలను పార్లమెంటుకు సమర్పించాల్సి ఉందన్నారు. కానీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ ప్రజల అభిప్రాయాలను, ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలను పక్కనపెట్టి ఏకపక్ష విధానాలతో వక్ఫ్ చట్ట సవరణ ప్రతిపాదనలు పంపడం దారుణమన్నారు. వక్ఫ్ కౌన్సిల్ బోర్డులో ముస్లిమేతరులను సభ్యులుగా చేర్చడం, వక్ఫ్ ఆస్తులను సర్వే కమిషనర్‌కు బదులు కలెక్టర్ సర్వే చేసేందుకు వీలు కల్పించడం, వక్ఫ్ ట్రిబ్యునల్ నిర్ణయాలను హైకోర్టులో సవాలు చేసేందుకు అనుమతించడం వంటి కీలక మార్పులను బిల్లులో ప్రవేశపెట్టారన్నారు. వక్ఫ్ ఆస్తులను ఉపయోగిస్తున్న వారి విషయంలో జోక్యం చేసుకోకూడదనడమంటే ఆక్రమణదారులకు రక్షణ కల్పించడమే తప్ప మరొకటి కాదన్నారు. రాజ్యాంగ సవరణల ద్వారా నియంతృత్వ పాలనను శాశ్వతపరచుకోవాలనే తపన తప్ప దేశ ప్రజలకు శ్రేయస్కరమైన పాలన అందించాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదన్నారు. రాజ్యాంగం, హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సయ్యద్ జాన్ బాషా, ఆబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వాసవీ కన్యకాంబ వ్రతం



కన్యకాంబ



వాసవాంబ సన్నిధిలో వ్రతం చేస్తున్న మహిళలు

కడప కల్చరల్: కడప నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో తొమ్మిది మంది కన్యలు గురువారం అమ్మవారి వ్రతం నిర్వహించారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కార్యక్రమాల నిర్వహణ కోసం ఆలయ ప్రాంగణంలో తొమ్మిది మంది కన్యలు సామూహిక మంగళ స్నానాలు ఆచరించారు. అమ్మవారిని ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అర్చకులు నవ కన్యలకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న నవ కన్యలతోపాటు వారి తల్లిదండ్రులు, బంధుమిత్రులు, భక్తులు వ్రతంలో పాల్గొన్నారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు అమ్మవారి ఆత్మార్పణ

శుక్రవారం అమ్మ వారు అగ్నిగుండంలో ఆత్మార్పణ చేసే కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటలకు రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం నుంచి 102 క్షీర కలశాలను ధరించిన యువతులు ఊరేగింపుగా అమ్మవారిశాలకు చేరుకోనున్నారు. 8.30 గంటలకు ఆలయంలో వాసవీ కన్యకాంబకు విశేష పూజలు, సాయంత్రం 3.30 గంటలకు అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు నిర్వహిస్తారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

కడప కల్చరల్: కడప నగరం పటేల్ రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల ఉచిత యోగా శిక్షణా శిబిరాన్ని శనివారం నుంచి ప్రారంభించనున్నామని సంస్థ నిర్వాహకులు, యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్టు డాక్టర్ కె.కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం, అధిక బీపీ, డయాబెటీస్, అస్తమా, గ్యాస్ట్రబుల్, ఒబెసిటీ, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు యోగాసనాలు, ప్రాణయామం, సూర్య నమస్కారాలు, షట్‌క్రియలు, ధ్యానం లాంటి ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామన్నారు. ఉదయం 5.45 నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, 8.30 నుంచి 10.00 గంటల వరకు మహిళలకు ప్రత్యేక బ్యాచ్, మూడవ బ్యాచ్ సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 98488 61206 లేదా 70132 38986 నెంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ జావిద్

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలు అరికట్టాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జావిద్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలలో బాగంగా కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తల గురించి తెలియజేశారు. అలాగే వాహనాలను నడిపేటప్పుడు ఖచ్చితంగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్సు తీసుకోవాలని సూచించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలను అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్‌ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ విజయలక్ష్మీ దేవి, శచీదేవి, డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలు



విద్యార్థులతో ప్రిన్సిపల్ నాగరాజు, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: బెంగళూరుకు చెందిన పెంటగాన్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 11 మంది విద్యార్థులు ప్రతిభ చాటి ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. కడప నగర శివారులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మెన్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రణాళికాబద్ధంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ట్రెనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపడంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను చైర్మెన్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ నాగరాజు అభినందించారు.

జంతు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పశు సంరక్షణ వాహనంతో జేడీ శారదమ్మ

కడప అగ్రికల్చర్: జంతు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారదమ్మ అన్నారు. ఆటవీశాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమ సంస్థ తరఫున జనవరి 14వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని పలు గ్రామాల్లో జంతు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాఘవేంద్ర పశుసంరక్షణ సంఘం తరఫున పెట్రోలింగ్ వాహనం ద్వారా జంతు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంతు సంక్షేమ సంస్థ సభ్యులు, పదవీ విరమణ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాబు పాల్గొన్నారు.

అద్దె బస్సు డ్రైవర్లు మెరుగైన సేవలందించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ఆర్టీసీలోని ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి సూచించారు. అద్దె బస్సుల యజమానులతో గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయపాలన పాటించడం లేదని ప్రయాణికుల వినతుల మేరకు బస్సులు ఆపడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. బస్సుల పరిశుభ్రత, కండీషన్ విషయంలోఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. అదే విధంగా సెల్‌ఫోన్, మద్యపానం చేసినపుడు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని ఆదేశించారు. అద్దె బస్సుల బకాయిలను త్వరగా చెల్లించేలా చూస్తామన్నారు.

ఈ సమావేశంలో అద్దె బస్సుల యజమానులసంఘం అధ్యక్షుడు భాస్కర్, గోవిందరెడ్డి, అద్దె బస్సుల యజమానులు, డిపో మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

టిప్పర్లు సీజ్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నానాపల్లి నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేశారు. 6 టిప్పర్‌లు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. మట్టి తరలించడానికి వారికి అనుమతులు వున్నాయనీ తెలపడంతో .. ఆ అనుమతులు సరియైనవా? కావా? అనే సమాచారం కోసం, తగిన చర్యల కోసం మైన్స్ అండ్ జియాలజీ, రెవెన్యూ అధికారులకు లెటర్‌ను పంపించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

కడప అర్బన్: ఏపీఎస్పీ 1998 బ్యాచ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడైన కానిస్టేబుల్ (పి.సినెం.675)కె.రాము తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెంలో విధులలో వుంటూ అకాల మరణం చెందాడు. దీంతో వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వై.జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తక్షణమే తమ1998 ఏపీఎస్పీ బ్యాచ్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి భార్య, కుమార్తెకు రూ.50 వేలు అసోసియేషన్ తరఫున కృష్ణ, రామాంజనేయులు కర్నూలుకు వెళ్లి అందజేశారు. ముందు కూడా వారి కుటుంబ సభ్యులకు తమ బ్యాచ్ అసోసియేషన్ ఎల్లపుడూ సపోర్ట్‌గా వుంటుందని తెలియజేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వామనమూర్తి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు.నగరంలోని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభల సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహించి వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో 35వేల మంది ఆటో డ్రైవర్లు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తూ ప్రభుత్వానికి కోట్ల రూపాయలు పన్ను చెల్లిస్తున్నారన్నారు.

ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీగా జరిమానాలు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 2131 రద్దు చేయాలని కోరారు. ఆటోల మీద ఉన్న పోలీస్ ఈ చలనాలు రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే ఆదాయం కోల్పోయే ఆటో డ్రైవర్‌కు ప్రత్యామ్నాయం చూపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగ సుబ్బారెడ్డి, మద్దిలేటి, కెసీ బాదుల్లా, హరి, వేణుగోపాల్, ఎస్ వెంకట శివ. మస్తాన్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో అత్యాధునిక వైద్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైవీయూ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వైద్య రంగంలో ఆధునిక సాంకేతికతను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ఉపయోగించడంలో కచ్చితత్వం ఉంటుందన్నారు. అనారోగ్యం అని తెలిసిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య శిబిరం నిర్వహించిన ఎస్ఈటీ సభ్యులను అభినందించారు. కుల సచివులు ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని గుర్తు చేస్తూ విలువైన సూచనలు అందజేశారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో పనిచేసే ప్రతి సిబ్బంది ఆరోగ్య సూత్రాలను పాటించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు రక్త పరీక్షలు, ఈసీజీ, బీసీ, వైటల్, ఐడిల్ బాడీవెయిట్, థైరాయిడ్, విటమిన్-డి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ వెంకట్రామిరెడ్డి, ఎస్ఈటీవీ వ్యవస్థాపకులు వైభవ్ అరుణ్‌కుమార్, డా.ఎం.రమ్యసాయు , స్టాఫ్ నర్సులు ఎస్.భావన, జి.అశ్విని, పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు

ఎల్ఈటీఎస్ డిప్యూటీ చీఫ్ డాక్టర్ శాంత



అతిథిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని జయించి.. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చునని ఎల్ఈడీఎస్ డిప్యూటి చీఫ్, ప్రముఖ అడ్వకేట్ పి.శాంత సూచించారు. కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా అధ్యక్షతన గురువారం మీట్ అండ్ గ్రీట్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రతినెలా నాలుగో శనివారం వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని పిలిపించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పరిచయం లేని వ్యక్తులు, మగవారితో మూడు నిమిషాలకంటే ఎక్కువ మాట్లాడ రాదన్నారు. ఈ కార్యక్రమంలో సుజాత, కేశవరెడ్డి, ఆశాలత, అజ్మతుల్లా, గురుమోహన్‌రెడ్డి, పీపీ.సుబ్బారెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరపాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: రానున్న పదో తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కడప జెడ్పీ బాలికల హైస్కూల్‌లో జిల్లాలోని ఉపాధ్యాయులకు నూతన ప్రశ్నాపత్రం, బ్లూ ప్రింట్, మారిన సిలబస్‌పై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప డివిజన్‌కు చెందిన కడప, బద్వేల్, పొద్దుటూరు, అంకాలమ్మపేట, పులివెందుల జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు యాక్షన్ ప్లాన్ పాలో అయ్యేలా చూడాలన్నారు. నిత్యం స్టడీ క్లాసులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ విజయబాస్కర్‌రెడ్డి, ఆర్‌పీలు కొండారెడ్డి, నాగసుబ్బయ్య, సురేష్‌కుమార్, మహేశ్వరెడ్డి, రెహమాన్ పాల్గొన్నారు.

వైవీయూ మహిళా విభాగం సమన్వయకర్తల నియామకం



ఉత్తర్వులను అందజేస్తున్న వీసీ.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం మహిళా విభాగం సమన్వయకర్తలు, సభ్యులను గురువారం నియమించారు. వైస్ ఛాన్సలర్ ప్రొ.కె. కృష్ణా రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి కలిసి సంబంధిత ఉత్తర్వులను సభ్యులకు గురువారం అందజేశారు. కో-ఆర్డినేటర్‌గా మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్ డి.వి జయలక్ష్మి, కో కో ఆర్డినేటర్‌గా అప్లైడ్ మ్యాథమెటిక్స్ విభాగం ప్రొఫెసర్ ఎల్.మాధవి, సభ్యులుగా జెనెటిక్స్ జెనోమిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ఉస్మాన్‌బాషా, జంతు శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, డా.వి.అను ప్రసన్న, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం సూపరింటెండెంట్ ఎస్.సుమలత, అసిస్టెంట్ బి.ఎం.ఖాజామొయినుద్దీలతగోపాటు విద్యార్థి ప్రతినిధిగా ఒకరిని ఎంపిక చేశారు.

జాగ్వార్ బాత్ లైటింగ్ షో రూమ్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న పెండ్యాల హరినాథ్‌బాబు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం పాత చిన్నచౌకు బైపాస్ ప్రాంతంలో జాగ్వార్ బాత్, లైటింగ్ షోరూమ్‌ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్ సూర్య ఇంటర్నేషనల్ అధినేత డాక్టర్ పెండ్యాల హరినాథ్‌బాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జనతా ఏజెన్సీ ప్రొప్రైటర్ షేక్ మహమ్మద్ ఆసిఫ్ మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా కొత్త డిజైన్లతో ఇంటికి సంబంధించిన అన్ని రకాల శానిటరీకి సంబంధించి బాత్రూమ్స్, లైటింగ్ ఇక్కడ లభిస్తాయన్నారు. ప్రజలు షోరూంలో లభిస్తున్న వస్తు సామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాగ్వార్ బ్రాంచ్ హెడ్ అభిజిత్ సింగ్, సూర్య ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఏపీ ప్రాజెక్ట్ రీటైల్ హెడ్ సాయికృష్ణ, ఎండీఎస్‌పీ విజయ్‌కుమార్, జాగ్వార్ టీఎస్, ఏపీ ఎస్సెకో హెడ్ వంశీకృష్ణ, ఏపీ, టీఎస్ లైటింగ్ హెడ్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎం.కామ్ చదివేందుకు అవకాశం కల్పించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఎం.కామ్ చదవడానికి అనుమతులు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు డిమాండ్ చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జి.వలరాజు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం నాలుగు సంవత్సరాల డిగ్రీ తీసుకువచ్చిందన్నారు. యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో హానర్స్ చేసేందుకు అవకాశం ఉందని తెలిపి, ఇప్పుడు లేదని చెప్పడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం ఒక పక్కన అనుబంధ కళాశాలలను అనుమతిస్తున్నామని తెలిపి, ఇపుడు విద్యార్థులను గందరగోళానికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆర్ట్స్ కళాశాలలోనే ఎంఏ, ఎంకాం లెటర్ ఎంట్రీకి అనుమతివ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తేజ, చంద్ర, అరుణ్, ఈశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సాయి మధు, హరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.